సాక్షి కామారెడ్డి

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



పూలను పూజించే..

పూలను పూజించే పండుగ బతుకమ్మ అని కలెక్టర్ సంగ్వాన్, చైతన్యానికి ప్రతీక అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు.

- IIలో ▸



బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా..

బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ అని వక్తలు కొనియాడారు. బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం

31.6 /22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం వేళ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టెక్నికల్ కోర్సులతో ఉపాధి



ఎల్లారెడ్డి: టెక్నికల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు అనేకం ఉంటాయని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్)/తాడ్వాయి(ఎల్లారెడ్డి) : బిచ్కుంద, తాడ్వాయి మండలం బ్రహ్మాజివాడిలో ఏటీసీలు ప్రారంభమయ్యాయి. బిచ్కుందలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, బ్రహ్మాజీవాడిలో ఎంప్లాయిమెంట్ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెంటర్లలో అన్ని రకాల టెక్నాలజీ యంత్రాలు బిగించడం జరిగిందన్నారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. బ్రహ్మాజివాడిలో టీవో రమేశ్, ఏటీవో వెంకటరమణ, శ్రీమాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో దోపిడీ తప్ప అభివృద్ధి లేదు



కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రంలో దోపిడీ తప్ప అభివృద్ధి జరలేదని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం మొత్తం రాష్ట్రాన్ని దోచుకుంటే, ఎమ్మెల్యేలు నియోజకవర్గాలో దోచుకున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఎన్నికల్లో టికెట్ రాక మతిస్థిమితం తప్పి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వమని మాట్లాడి తన పరువు, వారి పార్టీ పరువు తీసుకున్నారన్నారు. 10 ఏళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కానీ, నియోజకవర్గానికి 10 ఇళ్లు ఇవ్వలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో 65వేల ఉద్యోగాలు. పేదలకు సన్న బియ్యం, నియోజవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా ఎన్నో పథకాలు అమలు చేస్తోందని వివరించారు. మరో సారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు కారంగుల అశోక్‌రెడ్డి, ఐరేని సందీప్, గోనె శీను, గుడుగుల శీను, పంపరి లక్ష్మణ్, షేరు, అంజద్, లడ్డు, సత్యం, జమీల్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పీఠం జనరల్



'స్థానిక' రిజర్వేషన్లు ఖరారు

- బలహీన వర్గాలకు 42 శాతం సీట్లు...
- మహిళలకు అన్నింటా సగం స్థానాలు



లాటరీ ద్వారా రిజర్వేషన్‌లను ఖరారు చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి జిల్లా పరిషత్ పీఠం జనరల్ స్థానంగా ఖరారైంది. రాష్ట్రంలోని జిల్లా పరిషత్‌కు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ గెజిట్ విడుదల చేయగా.. కామారెడ్డి స్థానం అన్ రిజర్డ్వ్‌గా డిక్లేర్ చేశారు. అలాగే జిల్లాలోని ఆయా మండలాల జెడ్పీటీసీ స్థానాలు, ఎంపీపీ పదవులతోపాటు ఎంపీటీసీ స్థానాలు, సర్పంచ్, వార్డు స్థానాలకూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. బీసీలకు 42 శాతం చొప్పున ఆయా స్థానాల రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన నిర్ణయించారు. అలాగే అన్నింటా సగం స్థానాలు మహిళలకు కేటాయించారు. జిల్లాలోని 25 మండలాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులతోపాటు 233 ఎంపీటీసీ స్థానాలు, 532 సర్పంచ్, 4,656 వార్డు స్థానాలకు జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమక్షంలో రాజకీయ పార్టీల సమక్షంలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. అలాగే సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు ఆయా రెవెన్యూ డివిజన్‌లలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ఖరారు చేశారు. పంచాయతీ వార్డు సభ్యులకు సంబంధించి మండలాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఖరారు చేశారు. స్థానిక ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తవడంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్న నేతలు పోటీకి సై అంటుంటే, అనుకూలంగా రాని వాళ్లంతా నిరాశకు గురయ్యారు. మహిళలకు సగం స్థానాలు కేటాయించడంతో కొన్ని చోట్ల నాయకులు తమ కుటుంబ సభ్యులను రంగంలోకి దింపేందుకు ఆలోచనలు మొదలుపెట్టారు. జిల్లాలో 25 మండలాలు ఉండగా, 25 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లో నాలుగు స్థానాలు జనరల్‌కు, నాలుగు స్థానాలు జనరల్ మహిళకు కేటాయించారు. 11 స్థానాలు బీసీలకు కేటాయించగా ఆరు బీసీ జనరల్, ఐదు బీసీ మహిళలకు దక్కనున్నాయి. ఎస్సీలకు నాలుగు కేటాయించగా రెండు ఎస్సీలు, రెండు ఎస్సీ మహిళలకు, ఎస్టీలకు రెండు కేటాయించగా ఒకటి ఎస్టీలకు, ఒకటి ఎస్టీ మహిళకు కేటాయిస్తారు. జిల్లాలో 233 ఎంపీటీసీ స్థానాలు, 532 సర్పంచ్ పదవులు, 4,656 వార్డు సభ్యుల పదవులకు కూడా రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అయితే రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలోకి వెళ్లడంతో అధికారికంగా ప్రకటించడం లేదని తెలుస్తోంది.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్లు ఇలా..

మండలం	జెడ్పీటీసీ	ఎంపీపీ	మద్నూర్	జీసీ	జీసీ
బాన్సువాడ	జీసీ	జీసీ	మహమ్మద్‌నగర్	జీసీ మహిళ	జీసీ మహిళ
భిక్కనూరు	జీసీ	జీసీ	నాగిరెడ్డిపేట	ఎస్సీ మహిళ	ఎస్సీ
బీబీపేట	జీసీ మహిళ	జీసీ మహిళ	నస్రుల్లాబాద్	జనరల్	జనరల్ మహిళ
బిచ్కుంద	జనరల్	జనరల్ మహిళ	నిజాంసాగర్	జీసీ మహిళ	జీసీ
బీర్కూర్	జనరల్	జనరల్ మహిళ	పల్వంచ	జీసీ	జీసీ మహిళ
దోమకొండ	జనరల్ మహిళ	జనరల్	పెద్దకొడప్‌గల్	జీసీ	జీసీ మహిళ
డోంగ్లీ	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ	పిట్లం	జనరల్ మహిళ	జనరల్
గాంధారి	జీసీ మహిళ	జీసీ	రాజంపేట	ఎస్టీ	ఎస్టీ
జుక్కల్	ఎస్సీ	ఎస్సీ	రామారెడ్డి	జీసీ మహిళ	జీసీ మహిళ
కామారెడ్డి	ఎస్సీ	ఎస్సీ మహిళ	సదాశివనగర్	జనరల్ మహిళ	జనరల్
లింగంపేట	జీసీ	జీసీ	తాడ్వాయి	జనరల్	జనరల్ మహిళ
మాచారెడ్డి	ఎస్టీ మహిళ	ఎస్టీ మహిళ	ఎల్లారెడ్డి	జనరల్ మహిళ	జనరల్

'సాగర్' 15 గేట్లు ఎత్తివేత



నిజాంసాగర్(జుక్కల్): కర్ణాటక, మహారాష్ట్రలో కుండపోత వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుతోపాటు కౌలాస్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. అలాగే జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా సింగితం రిజర్వాయర్, నల్లవాగు మత్తడితోపాటు పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నాయి.

సింగూరు నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్‌లోకి శనివారం 1,09,470 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 15 గేట్ల ద్వారా 1,10,702 క్యూసెక్కుల నీటిని మంజీరాలోకి విడుదల చేస్తున్నారు.

కౌలాస్ ప్రాజెక్టు నుంచి..

కౌలాస్ ప్రాజెక్టులోకి 10,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 5 గేట్ల ద్వారా 12,522 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



ప్రధాన రోడ్డు ఇదీ..

జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డు పేరుకే ప్రధాన రోడ్డు. ఇక్కడి పరిస్థితి మాత్రం గల్లీ రోడ్డు కన్నా అధ్వానంగా ఉంటుంది. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్‌కు రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, పోలీస్ స్టేషన్ అన్నీ ఈ రోడ్డుపైనే ఉంటాయి. ఇంత కీలకమైన రోడ్డుకు కనీసం డ్రైయినేజీ వ్యవస్థ లేదు. చిన్న వర్షం కురిసినా రోడ్డుపైనే నీరు నిలుస్తుంది. ఈ సమస్య ఏళ్లుగా పట్టణ వాసులు ఎదుర్కొంటున్నా పట్టించుకున్న నాథుడే లేడు. పట్టణవాసులతోపాటు వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు ఈ రోడ్డుగుండా వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మేల్కొని నీరు పోవడానికి ఏదైనా మార్గం చూస్తారో.. లేదో మరి.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

చేను దగ్గరే వ్యాపారం

- కూరగాయలు, పూలు, పండ్ల విక్రయాలు
- కొనుగోలుదారులకు డబ్బు ఆదా.. విక్రయించే వారికి ఆదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న రైతులు

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తమ కష్టంతో సాగు చేసిన కూరగాయలు, పూలు, పండ్లను దళారులకు విక్రయిస్తే రైతుకు వచ్చే ఆదాయం తక్కువ. కొనుగోలుదారు వద్దకు వచ్చే సరికి ధర ఎక్కువ. అదే రైతు నేరుగా కొనుగోలుదారులకు విక్రయిస్తే కొనేవారికి డబ్బు ఆదా అవుతుంది. రైతులకూ మేలు చేకూరుతుంది. కొందరు రైతులు ఇదే సూత్రాన్ని పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కూరగాయలు, పండ్లు, పూలు పండించే రైతులు పంట చేను దగ్గరే రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు. అలాగే మామిడి పండ్ల సీజన్‌లో మామిడి రైతులు ఇదే సూత్రాన్ని పాటిస్తున్నారు. ఓ వైపు రైతులుగా, మరోవైపు వ్యాపారులుగా రాణిస్తున్న వారిపై 'సాక్షి' సండే స్పెషల్..



నర్సింలు బతుకు పూదోట

మాచారెడ్డి మండలం గన్‌పూర్(ఎం)కు చెందిన యువరైతు సిరికొండ నర్సింలు తనకున్న ఎకరం భూమిలో బంతి పూల తోట సాగు చేస్తున్నాడు. ఏటా దసరా, బతుకమ్మ, దీపావళి సీజన్ సమయానికి పూలు కోతకు వచ్చేలా ప్లాన్ చేస్తుంటాడు. ఈ సారి కూడా అలాగే సాగు చేశాడు. కామారెడ్డి-సిరిసిల్లా ప్రధాన రహదారిపై ఉన్న చేను వద్దే అమ్ముతుంటాడు. కిలోకు రూ.వందకు అమ్ముతున్నాడు. రోడ్డున వెళ్లేవారు పూలు కొనుగోలు చేస్తుంటారు. మంచి ఆదాయం వస్తోందని నర్సింలు అంటున్నాడు.

డ్రాగన్ ఫ్రూట్ అమ్ముతున్న లక్ష్మి

తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌కు చెందిన శివరాములు, లక్ష్మి దంపతులు కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై తమకు ఉన్న రెండున్నరెకరాల భూమిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. మూడేళ్ల కిందట మొక్కలు నాటి సంరక్షించగా, గతేడాది నుంచి చేతికందుతోంది.



రూ.100కు చొప్పున చేను వద్దే రోడ్డు మీద పెట్టి అమ్ముతున్నారు. కిలోకు నాలుగు నుంచి ఐదు ఫ్రూట్స్ వస్తున్నాయి. అదే బయటి మార్కెట్‌లో ఒక్కో దానికి రూ.50 నుంచి రూ.70 దాకా అమ్ముతుంటారు. దళారులకు అమ్మితే దళారీ లాభపడతాడని, అదే తాము విక్రయిస్తే తమతోపాటు కొన్న వారికి లాభం ఉంటుందని లక్ష్మి అంటోంది.

కూరగాయల సాగులో రారాజు

నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంపునకు చెందిన ఎర్రబొగుడ రాజు ఆరెకరాల్లో కూరగాయలు సాగు చేశాడు. బెండకాయ, వంకాయ, టమాట, కాలిఫ్లవర్ వంటి కూరగాయలు సాగు చేస్తున్నాడు. రోడ్డుపై కూరగాయల డబ్బాలు పెట్టుకుని అమ్ముతుంటాడు. రోడ్డున వెళ్లేవారు కిలోలకొద్దీ కొనుగోలు చేస్తుంటారు. మార్కెట్ ధర కన్నా తక్కువకు అమ్మడంతో ఓ వైపు కొనుగోలుదారులకు మేలు కలుగుతోందని, మరోవైపు తనకూ గిట్టుబాటవుతోందని రాజు చెబుతున్నాడు. దాదాపు పాతికేళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాడు.



రక్తదానంతో ఆరోగ్యం

కామారెడ్డి టౌన్ : రక్తదానం చేయడం ద్వారా మన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడంతోపాటు ఎదుటి వ్యక్తి ప్రాణాలను నిలిపిన వారమవుతామని హైకోర్టు అదనపు న్యాయమూర్తి నందికొండ నర్సింగ్‌రావు అన్నారు. ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడే పుణ్యకార్యం రక్తదానమని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయనకు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్రలు ఘన స్వాగతం పలికారు. జీజీహెచ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో న్యాయమూర్తి నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులకు రక్తదానం ఎంతో మేలు చేస్తుందని అన్నారు. తాను కూడా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడినని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రక్తదాతల గ్రూప్ నిర్వాహకుడు బాలుని న్యాయమూర్తి సన్మానించారు. రక్తదాతలకు అభినందన పత్రాలు అందజేశారు. అనంతరం జిల్లా కోర్టును సందర్శించి ఆవరణలో మొక్కలను నాటారు. జిల్లాలోని న్యాయమూర్తులతో సమావేశమై జుడీషియల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి టి నాగరాణి, సీనియర్ సివిల్ జడ్జి సూర సుమలత, ప్రథమ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి దీక్ష, బిచ్కుంద, ఎల్లారెడ్డి, బాన్సువాడ న్యాయమూర్తులు వినీల్‌కుమార్, సుష్మ, భార్గవి, డీఎఫ్‌వో నిఖిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు అదనపు న్యాయమూర్తి నందికొండ నర్సింగ్‌రావు

ఎనిమిదేళ్లకే ఏమిటీ పరిస్థితి..?

- వర్షం కురిస్తే ఊరుస్తున్న మున్సిపల్ భవనం
- ఎక్కడ చూసినా పగుళ్లు.. బలహీనమవుతున్న గోడలు
- కుంగుతున్న ఫ్లోర్
- కామారెడ్డి బల్దియా భవన దుస్థితి ఇది..



గోడలకు ఊడిపోతున్న పెచ్చులు



వర్షపు నీరు పడుతున్న చోట బకెట్, చెత్త బుట్ట

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ భవనం నిర్మించి ఎనిమిదేళ్లే అయినప్పటికీ అక్కడి పరిస్థితి మాత్రం పురాతన భవనాన్ని తలపిస్తోంది. గోడలకు నీటి చెమ్మ, పగుళ్లు వస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే అన్ని విభాగాల్లో ఊరుస్తోంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో నేల కుంగుతోంది. అక్కడక్కడ పెచ్చులూడుతున్నాయి. అదే జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం. 2013లో ప్రభుత్వ నిధులు రూ.కోటితో మున్సిపల్ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే నిధులు సరిపోకపోవడంతో 2015లో మరో రూ.కోటి 20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేయడంతో రెండస్థుల భవన నిర్మాణ పనులను పూర్తి చేశారు. 2017 సెప్టెంబర్ 20న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భవనాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం భవనంలోని ఆయా విభాగాల గదుల్లో టైల్స్ ధ్వంసమయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా మొదటి, రెండో అంతస్తులోని ఆయా గదుల్లో ఊరుస్తోంది. దీంతో నీరు పడకుండా బకెట్‌లు, చెత్తబుట్టలను సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. గోడలకు నీటి చెమ్మ వస్తుండడంతో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, అకౌంటెంట్ విభాగాల్లోని విలువైన రికార్డులు కౌన్సిల్ హాల్‌లోకి తరలించారు. కౌన్సిల్ హాల్‌లో పోడియం వెనకాల ఏసీ చెడిపోయింది. నీటి చెమ్మ కాణంగా విద్యుత్ వైర్లు కాలిపోతున్నాయి. ఎలక్ట్రానిక్ పరికరాలు చెడిపోతున్నాయి. గోడలకు రంగులు ఊడిపోతు కార్యాలయం కళావిహీనమైంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. కార్యాలయానికి మరమ్మతులు చేపడుతామని అన్నారు.



కౌన్సిల్ హాల్‌లో పెట్టిన రికార్డులు

మురుగుతున్న సోయా



గాంధారి శివారులో దెబ్బతిన్న సోయా

- పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలు
- ఆందోళనలో రైతాంగం
- ప్రభుత్వం ఆదుకోవాలని మొర

కామారెడ్డి క్రైం : పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలు కురుస్తుండడంతో సోయా రైతులు నిండా మునిగే పరిస్థితి ఏర్పడింది. కొన్ని రోజులు మినహా గత నెలరోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో సోయా తీవ్రంగా దెబ్బతిన్నది. వర్షాల కారణంగా సోయా మురిగిపోతుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పెట్టుబడులు కూడా తిరిగి చేతికొచ్చే పరిస్థితులు కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిగా దెబ్బతిన్న పంట..

నెల రోజులుగా కురుస్తున్న వానలకు సోయాబీన్ దాదాపు పోయినట్లేనని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఇంకా పంట కోతలు ప్రారంభం కాకపోగా ఆకు రాలిపోయింది. అధిక వర్షాల కారణంగా కర్ర పలుచబడి కిందపడిపోగా, సోయా గింజలు బూజు పట్టి నల్లగా మారి చెడిపోతున్నాయి. సాధారణంగా ఎకరానికి కనీసం 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ప్రస్తుతం రెండు నుంచి 3 క్వింటాళ్లు కూడా రావడం కష్టంగా ఉంది. మరికొన్ని రోజులపాటు వర్షాలు ఇలాగే కురిస్తే ఆ కొంత దిగుబడి కూడా వచ్చే అవకాశాలు లేవు. నెల క్రితం కురిసిన వర్షాలకే పంట నీట మునిగి చాలా మట్టుకు దెబ్బతిన్నది. ఇప్పుడు కోత దశలో కూడా వానలు వదలకపోడంతో పంట పూర్తిగా చెడిపోయి రైతులకు కష్టాలు పెరిగాయి.

ఎకరానికి రూ.25వేల వరకు పెట్టుబడి

ఒక ఎకరం సోయా సాగు చేసేందుకు రైతులు రూ.25వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. విత్తనం బస్తాకు రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు, దున్నడం, ఎరువులు, గడ్డి మందులు, కలుపు తీతలు, పురుగుమందులు, కోతలకు ఖర్చులు, ఇలా దాదాపు రూ.25 వేల వరకు ఎకరానికి పెట్టుబడి ఖర్చులు ఉంటాయి. కనీసం 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తేనే పెట్టిన పెట్టుబడులు తిరిగి రైతుల చేతికొచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఆ పరిస్థితులు ప్రస్తుతం కనిపించడం లేదు. ప్రభుత్వమే నష్ట పరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

పంట అంతాపోయినట్లే



నేను ఏడు ఎకరాల్లో సోయా సాగు చేశా. పంట దాదాపు పోయినట్లే. ఇప్పటికే లక్షన్నరకు పైగా పెట్టుబడి అయింది. రూపాయి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ వానలకు ఏమైనా దిగుబడి వస్తుందో, రాదో కూడా తెలియడం లేదు. ప్రభుత్వమే నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. – జి.సంతోష్, రైతు, గాంధారి

క్లుప్తంగా

ఆ గ్రామ సర్పంచ్ ఎస్టీకి రిజర్వ్

● కాని గ్రామంలో ఒక్కరు కూడా ఎస్టీలు లేరు

నస్రుల్లాబాద్: అవును మీరు విన్నది నిజమే. గ్రామంలో ఒక్క ఓటు కూడా ఎస్టీకి లేదు. కాని ఆ గ్రామ ప్రథమ పౌరుడిగా మాత్రం ఎస్టీకి అధికారుల రిజర్వు చేశారు. దీనితో గ్రామ ప్రజల్లో గందరగోళం నెలకొంది. నస్రుల్లాబాద్ మండలంలోని అంకోల్‌లో సర్పంచ్ పదవికి నిలబడడానికి ఏ ఒక్క అభ్యర్థి లేరని.. పక్క గ్రామం నుంచి అరువు తెచ్చుకుందాం అంటూ సెటైర్లు వేసుకుంటున్నారు. అధికారుల పని తీరుకు ఈ రిజర్వేషన్ ఓ ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇంత కాలం సర్పంచ్‌గా పోటీ చేయాలన్న ఆశావహులకు మాత్రం నిరాశ ఎదురైంది. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని గ్రామ ప్రజలు చెబుతున్నారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం



మాచారెడ్డి: పాల్వంచ మండలం పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూచని శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కోడూరి అంజనేయులు, ఉపాధ్యక్షులుగా నరహరి, రాంచంద్రం, రామకృష్ణ కోశాధికారిగా ల క్ష్మణ్ , సహాయ కార్యదర్శులుగా నర్సింలు, దయా కర్, సలహాదారులుగా రాంచంద్రం బాల్‌రాజు, దశరథం, శ్రీనివాస్, రవీందర్‌లు ఎన్నికయ్యారు.

లలితా త్రిపుర సుందరి ఆలయ వార్షికోత్సవం



కామారెడ్డి అర్బన్: స్థానిక ఎన్జీవోస్ కాలనీలోని లలితా త్రిపుర సుందరి ఆలయ 8వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు లలితా హవనం జరిపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్ గుప్తా, దామోదర్, కె.ప్రభావతి, కాలనీ మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు.

బీసీ కులగణన వివరాలు తెలపాలి



కులాచారి దినేష్ పటేల్

సుభాష్‌నగర్: రాష్ట్రంలో డెడికేటెడ్ కమిషన్ ద్వారా చేసిన వెనుకబడిన తరగతుల (బీసీ) కులగణన వివరాలను తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తరఫున పూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. అలాగే బీసీ కులగణన నివేదిక వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ వివరాలు ప్రజలకు తెలిస్తేనే రిజర్వేషన్ల ప్రక్రియ ఎంత పారదర్శకంగా, సమానత్వంతో అమలు చేయనున్నారో తెలుస్తోందన్నారు.



బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో బతుకమ్మలతో సూపరింటెండెంట్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది



నర్వ గ్రామ పంచాయతీ వద్ద..



తిప్పాపూర్‌లో ..



చిన్నమల్లారెడ్డిలో..

ఘనంగా అట్ల బతుకమ్మ వేడుకలు

సాక్షినెట్‌వర్క్: తెలంగాణ బతుకమ్మ పండుగ ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో శనివారం ఘనంగా అట్ల బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. తీరొక్క పూలతో అందంగా అలంకరించిన అట్ల బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వీధుల్లో బతుకమ్మలను ఉంచి మహిళలు ఆడిపాడారు. స్థానిక కుంటలు, కుండీలు, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.



జిల్లా కేంద్రంలో సాయిబాబా ఆలయంలో బతుకమ్మలతో మహిళలు



తిర్మలాపూర్‌లో ..



మద్నూర్‌లో బతుకమ్మతో మహిళలు



బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



సరంపల్లిలో సంస్కార భారతి బతుకమ్మ సంబురాల విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు



బతుకమ్మతో చిన్నారి



బతుకమ్మతో యువతి



తలమడ్లలో..



తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో..



సదాశివనగర్‌లో ఐకేపీ కార్యాలయం వద్ద బతుకమ్మ సంబురాలు



ఎల్లారెడ్డిలో ..

బతుకమ్మ పాట



శ్రీ గౌరీ పూజ ఉయ్యాలో
చేయబూనితిమి ఉయ్యాలో
కాపాడి మమ్మేలు ఉయ్యాలో
కైలాస వాసివి ఉయ్యాలో
కాపాడి మమ్మేలు ఉయ్యాలో
శంకరి పార్వతి ఉయ్యాలో
శంభుని రాణి ఉయ్యాలో
ధ్యానింతుమమ్మ ఉయ్యాలో
మమ్ములను కరుణించు ఉయ్యాలో
ఏటేటా పూజిస్తాం ఉయ్యాలో
మా ఊరు చల్లంగా చూడు ఉయ్యాలో
మనుసు పెట్టి ఉయ్యాలో
మనువంత నిన్ను చేసుకొని ఉయ్యాలో
నిండుగా మొక్కుతున్నాం ఉయ్యాలో
మమ్మేలు మా అమ్మ గౌరమ్మ ఉయ్యాలో

–ఉమారాణి వైద్య, అంగన్‌వాడీ టీచర్, లింగాపూర్, కామారెడ్డి

ప్రకృతి మురిసేలా.. సంస్కృతి, సంప్రదాయానికి అద్దంపట్టేలా బతుకమ్మ పాట రాసే మహిళలకు ఇదే మా ఆహ్వానం. మీ పాటలను పంపాల్సిన వాట్సాప్ నంబర్

8332887332

నియామకం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ సంస్థ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం నేషనల్ గ్రీన్ క్రాప్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, అడవుల ప్రాముఖ్యత గురించి ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కోసం ఈ నియామకం చేపట్టినట్లు డైరెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ప్రపంచంలో పువ్వులను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో మహిళ ఉద్యోగినులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగను కలెక్టరేట్‌లో అన్ని ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులతో వైభవంగా నిర్వహించామన్నారు. ఎంతో పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులు సంతోషంగా ఈ పండుగలో పాల్గొన్నారని తెలిపారు. వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, తెలంగాణ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

చైతన్యానికి ప్రతీక బతుకమ్మ

భిక్కనూరు: తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మ చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వరంగల్, వేముల ప్రాంతాల్లో 1000 ఏళ్ల క్రితం ప్రారంభమైన బతుకమ్మ తెలంగాణ ప్రజల పండుగ అని ఏ ఒక్క పార్టీ పండుగ కాదన్నారు. బతుకమ్మ మహిళలను ఒకచోట చేర్చి ఆడుతూ పాడుతూ సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. బతుకమ్మ పాటలు సమాజంలోని రుగ్మతలను కూడా పారదోలుతాయన్నారు. తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మను స్థానిక చెరువు కుంటల్లో నిమజ్జనం చేయడం వెనుక సైన్స్ దాగి ఉందన్నారు. బతుకమ్మను పేర్చే గునుక, తంగెడి పూలల్లో ఔషధ గుణాలు ఉన్నాయని, ఈ పూలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల ఆ నీరు ఔషధ నీరుగా మారుతుందన్నారు. అందంగా బతుకమ్మలను పేర్చిన వారికి బహుమతులను అందజేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షులు బల్యాల రేఖ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న షబ్బీర్ అలీ, ఇతర ప్రజాప్రతినిధులు, మహిళలు

అందరూ నియమాలు పాటించాలి



దోమకొండలో సమావేశమైన ఆర్ఎస్ఎస్ శాఖ ప్రతినిధులు

● ఆర్ఎస్ఎస్ విభాగ్ గ్రామ వికాస్ సంయోజక్ కదిరె లక్ష్మారెడ్డి

దోమకొండ: మన సంస్కృతీ సంప్రదాయాలు భావి తరాలకు తెలిసేలా ప్రతి ఒక్కరూ నియమాలు పాటించాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ గ్రామ వికాస్ సంయోజక్ కదిరె లక్ష్మారెడ్డి అన్నారు. రాబోయే విజయ దశమి నాటికి ఆర్ఎస్ఎస్ ఏర్పాటై 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని హైదిమర్రి ఫంక్షన్‌హాలులో జరిగిన ఆర్ఎస్ఎస్ శాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

ఎవరికి వారు నియమాలు, నిబంధనలు పాటించాలన్నారు. స్వదేశీ వస్తువులను వినియోగించాలని, మాతృభాషలో మాట్లాడాలని చెప్పారు. అందరం సమానమనే భావనతో మెలగాలని హితవు పలికారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కదిరె మోహన్‌రెడ్డి, సుంచు రాములు, భూపాల్ లక్ష్మణ్, సిద్దరాములు, రిటైర్డు ఆర్మీ జవాన్ కిష్టారెడ్డి, డాక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటి మట్టం

● ప్రస్తుతం 62.93 టీఎంసీల నీటి నిల్వ
● కొనసాగుతున్న ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, ప్రాజెక్ట్ నుంచి ఔట్ ఫ్లోను సమానంగా చేయడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం శనివారం రోజంత నిలకడగా ఉంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 2లక్షల60 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ నుంచి 39 వరద గేట్ల ద్వారా 2 లక్షల 50 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి , మిగిలిన నీటిని కాలువల ద్వారా వదులుతున్నారు. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టాన్ని పెంచకుండ నిలకడగా ఉంచారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 62.93 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 400 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 632 క్యూసెక్కుల నీరు పోతుంది. లక్ష్మి కాలువ , అలీసాగర్‌లిఫ్ట్, గుత్పలిఫ్ట్‌ల ద్వారా నీటి విడుదల నిలిపివేశారు.

లక్ష్యం దిశగా విద్యుదుత్పత్తి

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యం దిశగా సాగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 60 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని లక్ష్యంగా జలసాధ విధించింది. ఇప్పటి వరకు 39 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగింది. గత 50 రోజులుగా సామర్థ్యానికి మించి విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. ఒక్కో టర్బయిన్ ద్వారా 9 మెగావాట్ల చొప్పున 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే సామర్థ్యం ఉంది. కానీ ప్రస్తుతం సామర్థ్యానికి మించి 36.45 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాగుతుంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎల్లారెడ్డి: ఆజామాబాద్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన బేగరి శివయ్య కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. రాత్రివేళ గుర్తుతెలియని దుండగులు వారి ఇంటి తాళాలను పగులగొట్టి, ఇంట్లో ఉన్న రూ.50వేల నగదు, 6 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. బాధితులు ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జిల్లావాసికి ఇన్నోవేషన్ అవార్డు

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పద్మానగర్‌కు చెందిన డాక్టర్ సింగం సుస్మితకు బెస్ట్ ఇన్నోవేషన్ ఐడియేషన్ అవార్డు లభించింది. వ్యవసాయ కీటక శాస్త్రంలో ఆమె పీహెచ్‌డీ చేయగా ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహోత్సవ్–2025 కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నిజాంసాగర్(జుక్కల్): ఆరేపల్లి సమీపంలో మంజీరా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి, ట్రాక్టర్లను పట్టుకొని యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

బోణీ కాని వైన్స్ టెండర్లు

ఖలీల్‌వాడి: జిల్లాలోని మద్యం షాపులకు ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్‌ను రెండు రోజుల క్రితం విడుదల చేసింది. అయితే ఈనెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని సుభాష్‌నగర్‌లోగల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్ర, శనివారం రెండు రోజులుగా మద్యం షాపులకు దరఖాస్తులు రాలేవు. రెండు రోజులుగా అల్పపీడనంతోపాటు బతుకమ్మ, దేవినవరాత్రులు ఉండటంతో వివిధ పనుల కారణంగా టెండర్లకు దరఖాస్తు చేయలేదని తెలుస్తోంది. సోమవారం నుంచి వైన్స్‌షాపులకు దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఎక్సైజ్ అధికారుల ద్వారా తెలిసింది.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

SERVICES

PASSPORT MISSING
■కదం మణిరాజ్ S/o. కదం లక్ష్మణ్ R/o. 2-114 మచ్చర్ల, ఆలూరు మండలం, NZB. నేను మచ్చర్ల నుండి ఆర్మూర్‌కి బైక్‌పై వెళ్తుండగా X5628240 నెం॥ గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికినచో సంప్ర: 7569534264.
[SCA25008528]

CHANGE OF NAME
■I, KARTHIKA DHONDI W/o. DHONDI NIKHIL R/o: H. No: 3-5-86, Husnabad Colony, Armoor, Nizamabad (D) have Changed my Name as BACHU KARTHIKA W/o. DHONDI NIKHIL.
[SCA25008521]

REAL ESTATE

భూమి కావలెను
■భూమి కావలెను. 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సంప్ర: 9440522536, 7013226716.
[SCA25008551]

WANTED
■Walk in Interview for Electricians, Plumbers, Supervisors. Ph: 7989896938
[HA-15521]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
Contact: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

కరెంట్‌షాక్‌తో బాలుడు మృతి



అభినయ్ (ఫైల్)

మాక్లూర్: తండ్రితో కలిసి పొలానికి వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామానికి చెందిన చింత ప్రవీణ్‌రెడ్డి అనే రైతు శుక్రవారం సాయంత్రం పొలానికి వెళుతుండగా, కుమారుడు చింత అభినయ్ (15) తాను వస్తానని చెప్పడంతో అతడిని తీసుకువెళ్లాడు. ప్రవీణ్‌రెడ్డి పొలానికి నీరు పెడుతుండగా కొద్ది దూరంలో ఉన్న కుమారుడు కరెంట్ మోటార్ వద్దకు వచ్చాడు. దీంతో అభినయ్‌కు కరెంటువైర్లు తగిలి, షాక్‌తో కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు కర్ర సాయంతో వైర్లను తీసివేసి, బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. కానీ అభినయ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు ..

నవీపేట: మండలంలోని బినోల గ్రామానికి చెందిన ముంత పోశెట్టి(56) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పోశెట్టి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా జీవితంపై విరక్తి చెంది శుక్రవారం గడ్డి మందుతాగాడు. వెంటనే అతడు అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాటర్ ట్యాంక్ పైనుంచి పడి కార్మికుడికి గాయాలు

నిజామాబాద్ సిటీ: నగరంలో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుడు వాటర్‌ట్యాంక్ పైనుంచి పడి గాయపడ్డాడు. వివరాలు ఇలా.. మున్సిపల్ కార్పొరేషన్‌లోని జోన్–4 వాటర్ వర్క్స్ విభాగంలో బింగి మధు అనే వ్యక్తి ఔట్‌సోర్సింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి వాటర్ ట్యాంక్ నిండిపోవడంతో అతడు వాటర్ లెవల్ చెక్‌చేస్తుండగా ప్రమాదవశాత్తూ ట్యాంక్ పైనుంచి జారి కిందపడిపోయాడు. అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తోటి కార్మికులు జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మధును మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ శనివారం ఉదయం పరామర్శించారు. వైద్య ఖర్చులను సంబంధిత ఏజెన్సీ భరిస్తుందని తెలిపారు.

కిలో బంగారానికి రూ.7లక్షల జీఎస్టీ ఫైన్

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల పట్టుబడిన కిలో బంగారానికి రూ.7లక్షల జీఎస్టీ ఫైన్ వేసినట్లు అధికారులు తెలిపారు. నగరంలోని కంఠేశ్వర్ వద్ద ఈనెల 24న పోలీసులు తనిఖీలు చేయగా సరైన పత్రాలు లేకుండా రవాణా చేస్తున్న కిలో బంగారంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. సూర్యవంశీ సాంబాజీ అనే వ్యక్తి ఈ బంగారంను మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి నిజామాబాద్ మీదుగా ఆర్మూర్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. దీనిపై జీఎస్టీ అధికారులకు మూడవ టౌన్ పీఎస్ నుంచి ఫిర్యాదు ఇవ్వడంతో జీఎస్టీ లేనందున రూ.7.08 లక్షలు జరిమానా విధించినట్లు చెప్పారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో కుక్కల దాడిలో లిఖిత్ చంద్ర (5) అనే చిన్నారి గాయపడ్డాడు. చిన్నారి శనివారం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడిచేశాయి. వెంటనే స్థానికులు గమనించి వాటిని తరిమేయడంతో ప్రమాదం తప్పింది. చంద్రను చికిత్స నిమిత్తం వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. జీపీ అధికారులు కుక్కల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నవీపేటలో చోరీ..

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన దోమల రమేష్ ఇంట్లో శనివారం సాయంత్రం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. రమేష్ భార్య లలిత వంటింట్లో వంట చేస్తుండగా దుండగులు చొరబడి బీరువాలోని నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటికి బీరువా ఉన్న గదికి వచ్చిన బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించింది. వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



దగ్గి శివారులో రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన మంజూరు హుస్సేన్(47) అనే వ్యక్తి కొంత కాలంగా మార్కెటింగ్ వృత్తి చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం అతడు బైక్‌పై నిజామాబాద్ వైపు బయలుదేరాడు. దగ్గి దర్గా శివారులో అతడు ఎడమ వైపు ఉన్న టాటా ఏస్‌ని ఓవర్‌టేక్ చేసి ముందుకు వెళ్లగా, ముందు వెళ్తున్న భారీ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతడు కిందపడిపోయి, తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు హెల్మెట్ ధరించినప్పటికీ, సరిగా లేకపోవడంతో ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

కుప్రియాల్ గ్రామ శివారులో..

మండలంలోని కుప్రియాల్ గ్రామ స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కామారెడ్డికి చెందిన ముత్తినేని సూర్యారావు (రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్) కొన్నేళ్లుగా హైవేపై ఉన్న శ్రీ కృష్ణ ఉడిపి హోటల్‌లో పని చేస్తున్నారు. శనివారం ఉదయం అతడు కామారెడ్డి నుంచి తన ద్విచక్ర వాహనంపై హోటల్‌కు బయలుదేరాడు. కుప్రియాల్ శివారులో అతడిని హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న రెనాల్ట్ క్విడ్ కారు అతివేగంతో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



జక్రాన్‌పల్లిలో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

జక్రాన్‌పల్లి: మండలంలో పలు చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డిచ్‌పల్లి సీఐ వినోద్ తెలిపారు. జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. జక్రాన్‌పల్లిలో ఎస్సై మాలిక్ రహమాన్ తన సిబ్బందితో బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో పాత నేరస్తుడు, మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన కోనేటి నరేష్ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతడిని పోలీసులు పట్టుకొని విచారించారు. రెండు నెలల క్రితం నల్లగుట్ట తండాలోని ఆలయంలో హుండీ చోరీ, ఈనెల 17న సికింద్రాపూర్‌లోని ఓ ఇంట్లో చోరీ చేసినట్లు అతడు అంగీకరించాడు. అతడి బ్యాగులో ఉన్న ఇనుప రాడ్‌ను, అతడి వద్ద నుంచి 9 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సై మాలిక్ రహమాన్, ఏఎస్సై శంకర్, కానిస్టేబుళ్లు జీవన్, రాజేశ్వర్ ఉన్నారు.